సంగారెడ్డి
నమస్తే తెలంగాణ
సోమవారం 30 సెప్టెంబర్ 2024
MONDAY, SEPTEMBER 30, 2024

హరీశ్‌రావును కలిసిన పటాన్‌చెరు నేతలు

హరీశ్‌రావుతో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, ఆదర్శ్‌రెడ్డి

పటాన్‌చెరు, సెప్టెంబర్ 29 : మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును ఆయన నివాసంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం నగరంలోని హరీశ్‌రావు నివాసంలో బీఆర్ఎస్ నాయకుడు ఆదర్శ్ రెడ్డి, అమీన్‌పూర్ వార్డ్ కౌన్సిలర్ కవిత శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్యయాదవ్ కలిసి సత్కరించారు. బీఆర్ఎస్ పార్టీకి త్వరలోనే మహర్దశ రాబోతుందని, ఇందుకు తాము తీవ్రంగా శ్రమిస్తున్నామని తెలిపారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్‌యాదవ్, మాజీ జీహెచ్ఎంసీ వార్డ్ మెంబర్ నవీన్‌రెడ్డి, విభూది కృష్ణ, మెరాజ్‌ఖాన్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ

కొత్త బస్టాండ్ ఎదుట ప్రధాన రహదారిపై జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి, సెప్టెంబర్29 : ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసేదే సీపీఎం పార్టీ అని సీపీఎం సంగారెడ్డి ఏరియా కార్యదర్శి యాదగిరి అన్నారు. ఆదివారం మహాసభల సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ఏకష్టం వచ్చినా అదుకునేది కమ్యూనిస్టులు ముందుంటారని, అధికారం లేకపోయినా ప్రజలు అంటి పెట్టుకొని ఉండేది కమ్యూనిస్టులేనన్నారు. కార్యక్రమంలో సీపీ ఎం నాయకులు హనుమంతు, దుర్గ య్య, మధు, రాజు, మల్లేశం, శివ, రాజేశ్, నాగరా జు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

పూరీ జగన్నాథుడిని దర్శించుకున్న భక్త బృందం

పూరీ జగన్నాథ్ ఆలయాన్ని దర్శించుకున్న లయన్స్ క్లబ్ కుటుంబసభ్యులు, భజన మండలి బృందం

సంగారెడ్డి, సెప్టెంబర్ 29 : పర్యాటక పర్యటనలో ఒడిషాలోని పూరి జగన్నాథ్ ఆలయాన్ని భక్త బృందం సభ్యులు దర్శించుకొని చిలికా సరస్సులో భజనలు చేసి అలరించారని లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ టూర్ ఆర్గనైజర్ వెంకటేశం అన్నారు. ఆదివారం ఒడిషాలో పర్యాటనలకు వెళ్లిన భక్తుల బృందం సభ్యులు పూరి, చిలికా సరస్సుల్లో టూరిజం డేను ఘనంగా జరుపుకొన్నారు. అంతర్జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27 నుంచి 30 తేదీ వరకు నాలుగు రోజులు ఒడిషాలోని భువనేశ్వర్, గిరిజా దేవిశక్తి పీఠం (జాజిపూర్), పూరి, కోణార్క్, చిలుక ఉప్పునీటి సరస్సులలో అంతర్జాతీయ పర్యాటక దినోత్సవాలను క్లబ్, అమీన్‌పూర్ చెందిన శ్రీభక్త హనుమాన్ భజనమండలి కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ పర్యటనలో క్లబ్ కోశాధికారి లయన్ కృష్ణ, సభ్యులు సరూపారాణి, శోభ, అయిన్‌పూర్ క్లబ్ అధ్యక్షుడు లయన్ కృష్ణా గౌడ్, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి సిద్ధి రాములు, వైర్మన్ సురేందర్, సభ్యులు అంజనేయులు, నాగభూషణం, లింగం, భజన మండలి సభ్యులు నాగేశ్వర్‌రావు, మహేందర్‌రెడ్డి, యాదయ్య, నారాయణరెడ్డి, కృష్ణ, చంద్రశేఖర్, నరసింహం, చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు ఉన్నారు.

దంతవైద్యశిబిరం విజయవంతం

శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

గుమ్మడిదల, సెప్టెంబర్29 : ఉచిత దంత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. ఆదివారం మండలంలోని అన్నారం పంచాయతీ పరిధిలోని స్టార్ కిడ్స్ ఫ్రీ స్కూల్‌లో ఇండో అమెరికన్ డెంటల్ దవాఖాన వైద్యులు నిర్వహించిన ఉచిత దంతవైద్యశిబిరంలో 70 మంది దంతసమస్యలతో బాధపడుతున్న వారు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. వీరికి డాక్టర్ సృజన వైద్యసిబ్బంది దంత పరీక్షలు చేశారు. పరీక్షలు చేసుకున్న వారికి దంత పరిశుభ్రత చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు గోకరి శేఖర్‌గౌడ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మళ్లీ వేతనాల కోసం ఆందోళన

జహీరాబాద్, సెప్టెంబర్ 29 : మిషన్ భగీరథ పథకం తాగునీటి సరఫరా చేసే క్షేత్ర స్థాయి తాత్కాలిక కార్మికులు వేతనాల కోసం మళ్లీ ఆందోళన దిగారు. దీంతో జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం, అందోల్ నియోజకవర్గంలోని రాయికోడ్ మండలాల పరిధిలోని గ్రామాలకు చెందిన ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ఆయా మండలాల్లోని దాదాపు 75 గ్రామాలకు మిషన్ భగీరథ పథకం కింద తాగునీరు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఆందోళన 19వ రోజుకు చేరినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆయా మండలాలకు రాఘవపూర్ శివారులోని మీషన్ భగీరథ ఫిల్టర్ బెడ్ నుంచి ఆయా మండలాలకు ప్రతి రోజు తాగునీరు సరఫరా అవుతుంది. ఆయామండలాలకు తాగునీటి సరఫరా చేసేందుకు నియమించిన క్షేత్రస్థాయిలో పనిచేసే తాత్కాలిక కార్మికులకు ఏడు నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలను చెల్లించడం లేదు. పలుమార్లు సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు తమ గోడును మొరపెట్టుకున్నా ఫలితం లేకవడంతోనే అందోళనకు దిగినట్టు కార్మికులు తెలిపారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆయా మండలాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. ఆయా మండలాల్లోని గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరా ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నామన్నారు. మిషన్ భగీరథ తాత్కాలిక కార్మికుల సమస్యను సంబంధిత కాంట్రాక్టర్‌తో చర్చిస్తామన్నారు. కార్మికులకు రావాల్సిన వేతనాలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

పద్మశాలీ సంఘం ప్రమాణ స్వీకారం

కొండాపూర్, సెప్టెంబర్ 29 : పద్మశాలీ సంఘం జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం మండల మల్కాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అఖిల భారత యువ నైటెడ్ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మ్యాడం బాబురావు, రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్, గొశికె యాదగిరి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం నూతన గౌరవ అధ్యక్షుడు మాకం మల్లేశం, జిల్లా అధ్యక్షుడు గుండు సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ గందెమల్లె రాజు, ప్రధాన కార్యదర్శి మునిపల్లి విశ్వనాథం, కోశాధికారి నక్క ప్రభాకర్, స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు సీతవైద్యం కిశోర్, అసోసియేట్ ప్రెసిడెంట్ గడ్డం జనార్దన్, ప్రధాన ఉపాధ్యక్షుడు కుందెన రాజు, పడిగె సత్యం, యువజన అధ్యక్షుడు కొలిపాక విక్రమాదిత్య, ప్రధాన కార్యదర్శి సుప్పాల శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు బోగ విజయలక్ష్మి, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీరాంవెంకట్, ప్రధాన కార్యదర్శి దండె నాగరాజు, కోట సతీశ్, నేతల పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం జిల్లా నూతన కార్యవర్గం

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, సెప్టెంబర్ 29 : ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడడంలో రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ఆదివారం స్థానిక అయ్యప్పదేవాలయంలో గురుస్వామి ఓదెల ప్రభు గుప్తా జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ తండ్రి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రక్తదాన శిబిరం అభినందనీయమని కొనియాడారు. రక్తదానం ప్రాణదానంలో సమానమని తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు బట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణశివరాజ్‌పాటిల్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతాగోపాల్, అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు గొనె శంకర్ గురుస్వామి, వోదెల రవీందర్‌గుప్తా, ఓదెల విలాస్‌గుప్తా, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే తప్పనిసరి

ఆత్మరక్షణకు కరాటే తప్పనిసరి అని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విద్యార్థులకు సూచించారు. ఆదివారం పట్టణంలోని గంజి మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్-14,17 బాల బాలికలకు కరాటే పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై కరాటే పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ కరాటేలో మంచి నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులకు కరాటే శిక్షణ ఇస్తున్న మాస్టర్ శంకర్‌గౌడ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ శివరాజ్ పాటిల్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, ఎన్‌జీఎఫ్ సెక్రటరీ అమూల్య మ్మ, కరాటే మాస్టర్ సతీశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం

మున్సిపల్ చైర్ పర్సన్ రోజా బాల్ రెడ్డి

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రోజా బాల్ రెడ్డి

బొల్లారం, సెప్టెంబర్ 29 : పాఠశాల ఉన్నతికి ఉపాధ్యాయులు అందించిన సేవలు అభినందనీయమని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ కోలన్ రోజాబాల్ రెడ్డి అన్నారు. స్థానిక తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల అభినందన సభకు మున్సిపల్ చైర్ పర్సన్ రోజా బాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేర్వేరు పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ వృత్తిపరంగా బదిలీలు సర్వసాధారణమని తెలిపారు. కాగా, ఆదర్శ పాఠశాల అభివృద్ధికి విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయులను అభినందించారు. వారి సేవల మూలంగానే విద్యార్థులు బాసర ఐఐటీలో సీట్లు సాధిస్తున్నారని ప్రశంసించారు. విద్యార్థుల ప్రగతి కోసమే పని చేశారని, వారు ఎక్కడికి వెళ్లినా ఇదే తరహాలో విద్యా బోధన అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, మాజీ ప్రిన్సిపాల్ శైలజ, ఉపాధ్యాయులు బాలకృష్ణ, భార్గవి, లలిత, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

'మన ఊరు-మన బడి'కి నిలువెత్తు నిదర్శనం

- రూ.1.23 కోట్లతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి
- కార్పొరేట్ స్థాయిలో నిర్మాణం ■ నేడు పాఠశాల భవనం ప్రారంభోత్సవం

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

రామచంద్రాపురం, సెప్టెంబర్ 29 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సీఎం కేసీఆర్ 'మన ఊరు.. మన బడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయాలు కేసీఆర్ ప్రభుత్వం ఖర్చు చేసింది. 'మన ఊరు-మన బడి'లో ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు, పాఠశాల భవనాల పునర్నిర్మాణ పనులను చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా ఎంతో మెరుగుపడ్డాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసింది. అందుకు నిదర్శనం ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ 5వ బ్లాక్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అని చెప్పుకోవచ్చు. 'మన ఊరు-మన బడి'లో భాగంగా పాఠశాల అభివృద్ధికి రూ.1.23కోట్లు అప్పటి ప్రభుత్వం కేటాయించింది. దీంతో పూర్తిగా శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను రెండు అంతస్తుల మేరా పునర్నిర్మాణం చేసి కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా అభివృద్ధి చేశారు. విద్యార్థులకు నూతన భవనంతో పాటు కావాల్సిన సౌకర్యాలు కల్పించారు. సోమవారం పాఠశాల భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవానికి ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని కార్పొరేటర్ పుష్పానగేశ్, పాఠశాల హెచ్ఎం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు పాఠశాల ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను కార్పొరేటర్ నేతృత్వంలో నిర్వహిస్తున్నారు.

మద్దూరులో 'దొంగల హల్‌చల్'

- చోరికి గురవుతున్న ట్రాక్టర్ బ్యాటరీలు ■ ఆందోళన చెందుతున్న రైతులు

రేబర్తిలో చోరీకి గురైన ట్రాక్టర్ బ్యాటరీ

మద్దూరు(ధూళిమిట్ట), సెప్టెంబర్ 29 : ఉమ్మడి మద్దూరు మండలంలో కొన్ని రోజులుగా దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు ఆలయాలను టార్గెట్ చేసి ఆలయ హుండీల్లోని నగదు, బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన దొంగలు ప్రస్తుతం ట్రాక్టర్ బ్యాటరీల చోరీకి పాల్పడుతున్నారు. మద్దూరు మండలంలో వరుసగా ట్రాక్టర్ బ్యాటరీలు చోరీకి గురవుతున్నాయి. 20 రోజుల వ్యవధిలోనే సుమారు 15 ట్రాక్టర్ బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. వ్యవసాయ బావులు, ఇండ్ల వద్ద నిలిపిన ట్రాక్టర్ల బ్యాటరీలను రాత్రి వేళల్లో దొంగలు ఎత్తుకెళ్లుతున్నారు. ఈ నెల 8న మద్దూరులో 1, వల్లంపట్లలో 1, రేబర్తిలో 3 బ్యాటరీలు, ఈ నెల 25న రాత్రి సలాఖపూర్‌లో 5, ధర్మారంలో1 బ్యాటరీని దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ నెల 27న మద్దూరులో అల్లమహలక్ష్మీకి చెందిన ట్రాక్టర్ బ్యాటరీని దొంగలు ఎత్తుకెళ్లారు. రేబర్తిలో శనివారం రాత్రి నల్ల భూపతిరెడ్డి, బొమ్మగాని చంద్రం, బొమ్మ వెంకటయ్యలకు చెందిన మూడు బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఒక్కో బ్యాటరీ విలువ సుమారు రూ. 10 వేలు ఉంటుందని బాధిత రైతులు వాపోతున్నారు. ఇదే తీరుగా జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగినట్లు సమాచారం. అక్కడ దొంగతనాలకు పాల్పడిన ముఠానే మద్దూరు మండలంలో సంచరిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వరుసగా ట్రాక్టర్ బ్యాటరీలు చోరీకి గురవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మద్దూరులో కొన్ని రోజులుగా జరుగుతున్న వివిధ చోరీలు పోలీసులకు సవాలుగా మారింది. పోలీసులు రాత్రి వేళలో పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఎస్సై షేక్ మహబూబ్‌ను వివరణ కోరగా, దొంగలను పట్టుకునేందుకు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

బైక్ ఢీ కొని వ్యక్తి మృతి

మునిపల్లి, సెప్టెంబర్ 29 : ద్విచక్ర వాహనం ఢీకొని ఓవ్యక్తి మృతి చెందిన సంఘటన మండలం లోని బుధేర చౌరాస్తాలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక ఏఎస్సై ఏసయ్య కథనం ప్రకారం.. మండలంలోని బుధేర గ్రామానికి చెందిన ఈశ్వరయ్య గౌడ్ (65) కల్లు దుకాణం నడుపుకొంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అందులో భాగంగానే ఖాళీ సీసాలను ఏరుకునేందుకు ఎన్‌హెచ్ 65 జాతీయ రహదారి దాటుతుండగా సదాశివపేట్ వైపు నుంచి కంకోల్ వైపు వెళ్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ డ్రైవర్ అతివేగం వాహనం నడుపుతూ ఈశ్వరయ్యను బలంగా ఢీకొట్టాడు. దీంతో ఈశ్వరయ్యకు బలమైన గాయాలు కావడంతో సంగారెడ్డి లోని ఓప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స నిర్వహిస్తుండగా, పరిస్థితి విషమించి ఈశ్వరయ్య గౌడ్ మృతి చెందినట్లు ఏఎస్సై ఏసయ్య తెలిపారు. మృతిడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

అల్లీపూర్ మాజీ ఎంపీటీసీ రాజేందర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, సెప్టెంబర్ 29 : జహీరాబాద్ పట్టణంలోని అల్లీపూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ రాజేందర్ మృతి పట్ల జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి మృతి చెందిన మాజీ ఎంపీటీసీ రాజేందర్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్ గిరిజన తండాకు చెందిన విశాల్ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయం తెలుసుకొని పట్టణంలోని ఏరియా దవాఖానకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు చిన్నారెడ్డి, హీరు రాథోడ్, మోహన్ నాయక్ తదితరులు ఉన్నారు.

సింగూరు జలాలు సాగుకు ఇవ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు

పార్టీ మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి జయరాజు

సంగారెడ్డి, సెప్టెంబర్ 29 : జిల్లా కేంద్ర తలపై ఉన్న సింగూరు ప్రాజెక్టు జలాలను జిల్లా రైతాంగానికి సాగుకు ఇవ్వాలని, ఎన్నికల్లో ప్రభుత్వం హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో పార్టీ మహాసభ సందర్భంగా జయరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు సింగూరు జలాలు సేద్యానికి ఇవ్వాలని, ఏండ్లు గడుస్తున్నా సింగూరు జలాలు జిల్లాకు ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లా సాగుకు సింగూరు జలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఇండ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, పెన్షన్లు అర్హులైన పేదలందరికీ ఇవ్వాలన్నారు. భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా రోడ్లన్నీ పాడై గుంతలమయమయ్యాయని, సంబంధిత శాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే గుంతల రోడ్లన్నీ మరమ్మత్తులు చేసి రవాణా వ్యవస్థను క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం సభ్యులు యాదగిరి, నర్సింహులు, నాయకులు రాజయ్య, ప్రభాకర్, సత్తయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

విజేతలతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, సెప్టెంబర్ 29 : క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి క్రీడోత్సవాల ముగింపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విజేతలతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం క్రీడాకారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తున్నవారిని ప్రోత్సహిస్తానని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఎస్‌జీఎఫ్ క్రీడలను విజయవంతంగా నిర్వహించిన కమిటీనీ ఎమ్మెల్యే అభినందించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అముల్యమ్మ మాట్లాడుతూ ఖోఖో, వాలీబాల్, కబడ్డీ అంశాల్లో అండర్ 17, అండర్ 14 విభాగాల్లో క్రీడలు నిర్వహించామన్నారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లను రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ గౌసుద్దీన్, వ్యాయమ ఉపాధ్యాయులు షర్పుద్దీన్, ఆసీఫ్, క్రిష్టయ్య, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎండర్ఎఫ్ చెక్కులు అందజేత

పటాన్‌చెరు, సెప్టెంబర్ 29 : ప్రజారోగ్యాలకు భరోసా సీఎం రిలీఫ్‌ఫండ్ అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రుద్రారం గ్రామానికి చెందిన వి. శివయ్యకు రూ. 3లక్షల ఎల్వోసీని కుటుంబ సభ్యులకు అందజేశారు. నిరుపేదల ఆరోగ్యాలకు భరోసా కల్పిస్తున్నామన్నారు.

కాల్వ ఆక్రమణను అడ్డుకున్న బీఆర్ఎస్ నేతలు

తెల్లాపూర్‌లోని వరద కాల్వలో టిప్పర్‌తో మట్టిని నింపుతున్న దృశ్యం

రామచంద్రాపురం, సెప్టెంబర్ 29 : తెల్లాపూర్‌లోని వనం చెరువుకు సంబంధించిన వరద కాల్వను కొందరు వ్యక్తులు ఆక్రమణకు పాల్పడుతున్నారు. తెల్లాపూర్‌లోని జీబ్లాక్‌లో టిప్పర్ల ద్వారా మట్టిని తీసుకువచ్చి వరద కాల్వలో పోస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎన్ నేత గుడ్ల సాగర్, తదితరులు ఘటనా స్థలానికి వెళ్లి వరద కాల్వ ఆక్రమణను అడ్డుకున్నారు. అప్పటికే పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా అక్రమార్కులు మట్టిని నింపారు. కాల్వలో మట్టిని నింపే పనులను అడ్డుకొని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డికి బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం గోపన్‌పల్లి నుంచి జీబ్లాక్ మీదుగా తెల్లాపూర్‌లోని వనం చెరువులోకి ఈ కాల్వ ద్వారా వర్షపు నీరు వెళ్తాయి. కాల్వను పూడ్చడంతో వరదల కారణంగా భారీ ముంపు ఏర్పడే ప్రమాదం ఉన్నదని గ్రామస్తులు అంటున్నారు. వెంటనే కమిషనర్ స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎన్ నేతలు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

జహీరాబాద్, సెప్టెంబర్ 29 : మండలంలోని శేఖాపూర్ గిరిజన తండాలో కరెంట్ షాక్ తగిలి ఓవ్యక్తి మృతి చెందినట్టు జహీరాబాద్ రూరల్ ఎస్సై సీహెచ్ ప్రసాద్‌రావు తెలిపారు. వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం స్థానిక గిరిజన తండాకు చెందిన విశాల్ పవర్ (28) తన పొలానికి వెళ్లాడు. పొలానికి నీరు పెట్టేందుకు స్టార్టర్ వద్దకు వెళ్లే క్రమంలో నేలపై తెగిపడిన కరెంట్ వైర్‌కు కాలు తగిలి, షాక్ రావడంతో సృహ కోల్పోయాడు. స్థానికుల సహాయంతో వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కార్మికుల నిరసన

కోహీర్, సెప్టెంబర్ 29 : తమకు వేతన ఒప్పందం అమలు చేయాలని రాక్‌వూల్ పరిశ్రమ కార్మికులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కవేలి రాక్‌వూల్ (సెయింట్ గోబెన్) పరిశ్రమ కార్మికులు వేతన ఒప్పందం కోసం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న తమకు ఎనిమిది నెలలుగా వేతన ఒప్పందం చేయడం లేదని వారు నిరసన వ్యక్తం చేశారు. వేతన ఒప్పందం కోసం చర్చలు ప్రారంభించడంలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. యజమాన్యం వెంటనే నిర్లక్